గురుకుల పోస్టుల భర్తీ ఎప్పుడు?

- నోటిఫికేషన్ ఆధారంగానే నింపాలి
- లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- ప్రభుత్వానికి ఏఐవైఎఫ్ హెచ్చరిక
- సంక్షేమభవన్ ఎదుట ధర్నా

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంక్షేమ భవన్ ఎదుట నిరసన తెలుపుతున్న గురుకుల అభ్యర్థులు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): నోటిఫికేషన్ ఆధారంగానే గురుకుల పోస్టుల నియామకాలను చేపట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), గురుకుల అభ్యర్థులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మాసాబ్ ట్యాంక్‌లోని సంక్షేమభవన్ తెలంగాణ గురుకుల నియామక బోర్డు ఎదుట శనివారం భారీ ధర్నా నిర్వహించారు. గురుకుల అభ్యర్థులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లోని ఖాళీల భర్తీకి గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతోపాటు పరీక్షలను సైతం నిర్వహించిందని, ఫలితాలను వెల్లడించాల్సి ఉన్నదని తెలిపారు. అయితే కొంతమంది నియామక బోర్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం వాటిల్లిందని ఆవేదన వ్యక్తంచేశారు. నోటిఫికేషన్‌కు విరుద్ధంగా పోస్టులను భర్తీ చేయాలని యోచిస్తున్నారని, తద్వారా మహిళా అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే అవకాముందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ ప్రకారమే రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. సత్వరమే కాంగ్రెస్ ప్రభుత్వం అభ్యర్థుల సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీని నియమించాలని, అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐవైఎఫ్ నేతలు, గురుకుల అభ్యర్థులు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అభ్యర్థులకు న్యాయం చేయడానికి కృషి చేస్తామని నియామక బోర్డు అధికారులు నర్సింగ్‌రావు, షౌకత్‌అలీ ఖాన్ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, గురుకుల అభ్యర్థులు అస్మా, ప్రియాంక, జ్యోష్ణ, జ్యోతి, సుజాత, విజయ, మంగమ్మ, అమృత, కవిత, మమతతో పాటు 50 మంది పాల్గొన్నారు.

అభ్యర్థులకు న్యాయం చేయాలి: డీవైఎఫ్ఐ

నోటిఫికేషన్ ఆధారంగానే అభ్యర్థుల నియామకాలు చేపట్టి అభ్యర్థులకు న్యాయం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావిద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షలను నిర్వహించినా ఫలితాలు వెల్లడించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఫలితంగా గురుకుల అభ్యర్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సత్వరమే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ప్రకటనలో హెచ్చరించారు.

శత్రు దేశాల డ్రోన్‌ల కదలికలను పసిగట్టవచ్చు

సరిహద్దులు దాటి దేశంలోకి ప్రవేశించే శత్రుదేశాల డ్రోన్‌లను పసిగట్టే పరికరాన్ని ఐఐటీ జమ్ముకు చెందిన ముర్తుజా బృందం అభివృద్ధి చేసింది. ప్రస్తుతం రక్షణ దళాలు సరిహద్దు దాటి వచ్చే డ్రోన్‌లను పసిగట్టేందుకు రేడియో ఫ్రీక్వెన్సీ, రాడార్ బేస్ టెక్నాలజీ వాడుతున్నాయి. అయితే.. ఈ రెండు టెక్నాలజీలతో శత్రుదేశం డ్రోన్‌లు ఎక్కడ ఉన్నాయి? ఎంత ఎత్తులో ఎగురుతున్నాయి? అనే విషయాలను వెంటనే పసిగట్టి కూల్చేయలేకపోతున్నాయి. ఈ తరుణంలో.. ఐఐటీ జమ్మూకు చెందిన ముర్తుజా పరిశోధన బృందం.. ధ్వని తరంగాల ద్వారా శత్రుదేశ డ్రోన్‌లను వెంటనే గుర్తించే యంత్రాన్ని కనుగొన్నది. ఈ యంత్రం శత్రుదేశ డ్రోన్‌లు ఎంత ఎత్తులో ఉన్నా కచ్చితంగా గుర్తించి రక్షణ దళాలను అప్రమత్తం చేస్తుంది. డ్రోన్‌ల జాడ తెలుసుకున్న రక్షణ దళాలు.. వెంటనే వాటిని కూల్చేసే అవకాశం ఉంటుంది.

తేలికపాటి వ్యవసాయ పరికరాలు

తక్కువ ధర, తేలికపాటి బరువుతో ఉండే వ్యవసాయ పరికరాలను నాగ్‌పూర్‌కు చెందిన విశ్వేశ్వరయ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధన బృందం అభివృద్ధి చేసింది. ప్రస్తుతం రైతులు ఉపయోగిస్తున్న వ్యవసాయ పరికరాల కంటే తేలికైన, తక్కువ ధరలో లభించేలా తయారు చేశారు. ఈ పనిముట్లు రైతులకు ఎంతో ఉపయోగపడుతూ.. ఎక్కువ కాలం తప్పుపట్టకుండా ఉంటాయి.

సైన్స్ సందేహాలా? 'ఆస్క్-ఆర్‌సీటీఎస్'

- విద్యార్థుల కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించిన ఐఐఐటీ
- ఐఐటీహెచ్‌లో ఆకట్టుకున్న సరికొత్త ఆవిష్కరణలు
- 'ఐఐటీహెచ్, ఈ-స్పిన్ టెక్' మధ్య కుదిరిన ఒప్పందం
- సంగారెడ్డి జిల్లా కందిలో ముగిసిన మెగా టెక్నో ఫెయిర్

సంగారెడ్డి, జనవరి 20 (నమస్తే తెలంగాణ): సైన్స్ అంటేనే.. ఊహకందని రహస్యాలను ఛేదించేందుకు నిత్యం పరిశోధించడం, మానవాళికి నిర్దిష్టమైన సమాచారాన్ని అందించడం. ఈ క్రమంలో ఎన్నో సందేహాలు, అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. వాటిని ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకుంటూ.. సైన్స్‌ను అధ్యయనం చేసేందుకు ఐఐఐటీ 'ఆస్క్.. ఆర్‌సీటీఎస్' అనే ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించింది. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఇన్వెంటివ్-24 మెగా టెక్నో ఫెయిర్‌లో ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీలు ప్రదర్శించిన మరిన్ని ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా ఈ-స్పిన్ నానో టెక్నాలజీ సంస్థ ఐఐటీ హైదరాబాద్‌తో సాంకేతిక బదిలీ కోసం ఒప్పందం కుదుర్చుకున్నది. ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, ఈ-స్పిన్ నానో టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ సందీప్ పాటిల్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. నానో ఫైబర్‌ను ఉపయోగించి మహిళల కోసం తేలికపాటి శానిటరీ ప్యాడ్‌ను ఐఐటీహెచ్ అభివృద్ధి చేసింది. నానో ఫైబర్ శానిటరీ ప్యాడ్ తయారీ సాంకేతికతను ఈ-స్పిన్ టెక్ సంస్థకు బదిలీ చేయనుంది. ఈ సందర్భంగా ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ.. మెగా టెక్నో ఫెయిర్ చివరి రోజు ఈ-స్పిన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. శనివారం ముగిసిన మెగా టెక్నో ఫెయిర్‌లో పారిశ్రామిక ప్రతినిధులతో పాటు వివిధ సాంకేతిక విద్యా సంస్థల ప్రతినిధులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు హాజరై ఆవిష్కరణలను తిలకించారు.

సైన్స్‌లో సందేహాలకు నివృత్తి

గూగుల్, చాట్ జీపీటీ లాంటి వేర్వేరు వెబ్‌సైట్ల ద్వారా విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ అవసరం లేకుండానే ఒక్క ఫోన్‌కాల్ ద్వారా 7, 8, 9 తరగతుల విద్యార్థులు ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టుల్లో తమ సందేహాలకు సమాధానాలు పొందొచ్చు. ఇందుకు ఐఐఐటీ ప్రత్యేక యాప్‌ను తయారు చేసింది. ఆగస్త్య ఫౌండేషన్‌తో కలిసి ఆస్క్-ఆగస్త్య పేరిట ఆస్క్-ఆర్‌సీటీఎస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 1,900 పాఠశాలల విద్యార్థులు ఆస్క్-ఆర్‌సీటీఎస్‌ను వినియోగిస్తున్నారు. త్వరలోనే విద్యార్థులందరికీ ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఐఐఐటీ ప్రతినిధులు ప్రభాకర్ ఎల్ల, రమేశ్ లోక తెలిపారు.

నిల్వ ధాన్యం నాణ్యతను తెలుసుకోవచ్చిలా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని గోదాముల్లో ఆహార ధాన్యాలను నెలల తరబడి నిల్వ ఉంచడంతో పాడవుతాయి. ఇలాంటి పరిస్థితిలో బియ్యం, గోధుమలు, ఇతర ఆహారధాన్యాల నాణ్యతను గుర్తించడం గోదాముల్లోని సిబ్బందికి కష్టం అవుతుంది. ఆహార ధాన్యాలు పాడయ్యాయా? లేదా? తెలుసుకునేందుకు తంజావూరుకు చెందిన శస్త్ర యూనివర్సిటీకి చెందిన డాక్టర్ మనివన్నన్ కృత్రిమ మేధను ఉపయోగించి ప్రత్యేక పరికరం(ఐవోటీ) తయారు చేశారు. ఇది బియ్యం, గోధుమల నుంచి వచ్చే వాసనను గుర్తించి.. ధాన్యం చెడిపోయింది.. లేనిది చెప్తుంది.

'పామ్ వ్యూ'తో మొక్కల అవసరాల గుర్తింపు

ఇంట్లో, డాబాపైన పెంచే కూరగాయలు, ఆకుకూరలు, ఇతర మొక్కలకు.. నీళ్లు, ఇతర పోషకాల అవసరాలను తెలుసుకునే సెన్సర్ యంత్రాన్ని ఐఐటీ బిలాయ్‌కు చెందిన అంకిత్ అవస్తి, రోషిని కౌషిక్, ఆస్తా రంగ్రూర్ రూపొందించారు. మొక్కలు ఉండే ప్రాంతంలో సెన్సర్ యంత్రాన్ని బిగించాలి. ఈ సెన్సర్ నిరంతరం మొక్కల ఎదుగుదలను పసిగడుతూనే.. వాటికి కావాల్సిన నీళ్లు ఇతర ఖనిజాలు ఎంత మేర అవసరమో అంచనా వేస్తుంది. ఆ వెంటనే ఐఐటీ బిలాయ్ పరిశోధకులు అభివృద్ధి చేసిన పామ్ వ్యూ యాప్ ద్వారా కూరగాయల పెంపకందారులకు ఫోన్‌లో సమాచారం అందజేస్తారు.

సూర్యశక్తి.. సైనికుల కష్టాలకు విముక్తి



జమ్ముకశ్మీర్‌తోపాటు ఇతర శీతల ప్రదేశాల్లో దేశ రక్షణ విధుల్లో ఉండే సైనికులు చలి తీవ్రత కారణంగా నానా అవస్థలు పడతారు. వారి కష్టాలు తీరేలా ఐఐటీ బాంబేకు చెందిన శుభం బృందం.. సూర్యశక్తి పేరిట ఎన్‌సీఎఫ్ టెక్నాలజీతో హీటింగ్ పరికరాలను అభివృద్ధి చేసింది. నానో కార్బన్ ఫ్లూయిడ్స్ కోటింగ్ ద్వారా తయారు చేసిన హీటింగ్ పరికరాలు.. సూర్యరశ్మిని గ్రహించి చల్లనీటిని వెంటనే వేడి చేస్తాయి. సైనికులు ఉండే బంకర్లను క్షణాల్లో గరం చేస్తాయి. బంకర్లలో నిరంతరం వేడిగాలి ఉండేలా ఉష్మా పేరిట మరో యంత్రాన్ని ఐఐటీ బాంబే అభివృద్ధి చేసింది. ఇవి సైనిక బలగాలు చలి తీవ్రత నుంచి తప్పించుకునేందుకు ఎంతో ఉపయోగపడుతాయని, తాము అభివృద్ధి చేసిన ఎన్‌సీఎఫ్ హీటింగ్ పరికరాలు సోలార్ పద్ధతిలో పనిచేయడంతో ఎలాంటి ఖర్చు ఉండదని పరిశోధకుడు శుభం తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టులు మృతి

కొత్తగూడెం క్రైం, జనవరి 20 : ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు, జవాన్లకు మధ్య శనివారం జరిగిన భీకరపోరులో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. పోలీస్ అధికారుల కథనం ప్రకారం.. బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెలంగుట్ట సమీపంలో మావోయిస్టు పార్టీ డీవీసీఎం వినోద్ కర్మ, అవాపల్లి ఎల్‌వోఎస్ రాజు పూనెం, ఏరియా కమిటీ సభ్యులు విశ్వనాథ్, గుడ్డు తెలం ఆధ్వర్యంలో సుమారు 25 మందితో సమావేశం జరుగుతున్నట్టు పోలీస్ అధికారులకు సమాచారం తెలిసింది. ఈ మేరకు డీఆర్‌జీ, కోబ్రా 210 బెటాలియన్ సంయుక్త ఆధ్వర్యంలో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో బెలం గుట్ట సమీపంలో ఉదయం 7:30 గంటల సయమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు ప్రారంభించారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య సుమారు 15 నిమిషాలపాటు భీకరపోరు జరిగింది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే ఎత్తయిన గుట్టల మీదుగా దట్టమైన అటవీమార్గంలోకి పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం ఆ ప్రాంతాన్ని జవాన్లు తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చేపట్టగా.. ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఆయుధ, వస్తు సామగ్రి లభించింది. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు.

మందుపాతర పేలి జవాన్‌కు గాయాలు

ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి జవాన్‌కు గాయాలయ్యాయి. బీజాపూర్ జిల్లా చిన్నగేలూర్ క్యాంపు నుంచి ఎస్‌టీఎఫ్ జవాన్లు ఏరియా డామినేషన్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో పోలీసులను టార్గెట్ చేస్తూ గుండెంతోయ నాల్ వద్ద మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై ప్రమోద్‌శర్మ అనే జవాను కాలు వేయడంతో అది పేలింది. ఈ ఘటనలో ప్రమోద్‌కు తీవ్రగాయాలయ్యాయి. తోటి జవాన్లు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఎయిర్‌లిఫ్ట్ ద్వారా రాయ్‌పూర్‌కు తరలించారు.

ఎఫ్ఆర్ఎస్‌సీ ఫెలోగా

సూర్యాపేట వాసి

భారతీయ సంతతికి చెందిన డాక్టర్ శశిరవి సుమన్ ఎంపిక



బొడ్రాయిబజార్, జనవరి 20 : భారతీయ సంతతికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ శశిరవి సుమన్ రుద్రంగి యునైటెడ్ కింగ్‌డమ్‌లోని రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (ఎఫ్ఆర్ఎస్‌సీ) ఫెలోగా ఎంపికయ్యారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ సుమన్ యునైటెడ్ కింగ్‌డమ్, ఐర్లాండ్‌లోని కెంట్ అథ్లోస్ ఫార్మా గ్రూపులో సీనియర్ డ్రగ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ కమర్షియలైజేషన్ మేనేజర్ (టెక్నికల్ హెడ్)గా పని చేస్తున్నారు. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ప్రపంచంలోనే అత్యంత పురాతన రసాయన సంఘం కాగా, 2016లో 175వ వార్షికోత్సవం జరుపుకొన్నది. సుమన్ ఐదేండ్లకు పైగా సీనియర్ హోదాలో ఉన్నారు. రసాయన శాస్త్రాల పురోగతిపై ఇతను గణనీయమైన పనితీరును ప్రదర్శించారు.

ఏసీబీ వలలో సర్వేయర్

8 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వశ్యానాయక్



సర్వేయర్ వశ్యానాయక్

కల్వకుర్తి రూరల్, జనవరి 20 : భూ సర్వేకు సంబంధించిన రిపోర్టు ఇవ్వడానికి లంచం తీసుకుంటూ సర్వేయర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్నది. ఏసీబీ మహబూబ్‌నగర్ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండలం లింగారెడ్డిపల్లికి చెందిన సిరాజ్ తన భూమిని కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న డివిజన్ సర్వేయర్ వశ్యానాయక్‌తో సర్వే చేయించారు. భూమి కొలతలకు సంబంధించిన రిపోర్ట్ ఇవ్వాలని కోరగా వశ్యా నాయక్ రూ.10 వేలు డిమాండ్ చేశాడు. చివరకు రూ.8 వేలకు ఒప్పందం కుదిరింది. శనివారం సాయంత్రం సర్వేయర్ వశ్యానాయక్‌కు రూ.8 వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణ గౌడ్ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

ముగ్గురి దుర్మరణం

గద్వాల అర్బన్, జనవరి 20 : కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన నరేశ్ (23), పవన్ (28), ఆంజనేయులు (50), గోవర్ధన్, నవీన్, మహబూబ్ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు దవాఖానలో పనిచేస్తున్నారు. శుక్రవారం వైద్యశాలకు చెందిన డాక్టర్ కూతురి జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. విందులో పాల్గొన్న వీరు అర్ధరాత్రి సమయంలో వైద్యుడికి చెందిన ఎలక్ట్రిక్ కారుకు చార్జింగ్ పెట్టి ఉంచగా.. అతడి అనుమతి లేకుండానే వాహనం తీసుకొని ఆరుగురు గద్వాల నుంచి ఎర్రవెల్లి వైపు బయలుదేరారు. కారును మహబూబ్ అతివేగంగా నడపడంతో జమ్మిచేడ్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. కారు దెబ్బతినడంతో అందులోని నరేశ్, పవన్, ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంజినీర్ కమ్ డాక్టర్!

- ఐఐటీ మద్రాస్‌లో కొత్తగా మెడికల్ సైన్సెస్ అండ్ ఇంజినీరింగ్ డిగ్రీ
- టార్గెట్.. 15 ఏండ్లలో నోబెల్
- త్వరలో స్పోర్ట్స్ కోటా అమలు
- క్రీడాకారులకు సీట్ల కేటాయింపు
- 'నమస్తే తెలంగాణ'తో సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ కామకోటి

కొత్తగా స్పోర్ట్స్ కోటా

క్రీడాకారులు, ఆటలను ప్రోత్సహించటంలో భాగంగా ఐఐటీ మద్రాస్‌లో కొత్తగా స్పోర్ట్స్ కోటాను అమలుచేయాలని ఇటీవలే నిర్ణయం తీసుకున్నాం. 2024-25 నుంచి ప్రయోగాత్మకంగా ఈ కోటాను అమలుచేస్తాం. దేశంలోని ఏ ఐఐటీలోనూ ఈ తరహా విధానం అమల్లో లేదు. 10 సీట్లకు ఒక సీట్‌ను స్పోర్ట్స్ కోటా ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. దీంతో ఒక్కో కోర్సులో ఒకరిద్దరు చేరే అవకాశం ఉంటుంది. ఒక ఏడాదిలో 20-30 సీట్లను క్రీడాకారులకు కేటాయిస్తాం' అని పేర్కొన్నారు.

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): డాక్టర్ కావాలంటే ఎంబీబీఎస్ చేయాలి. ఇంజినీర్ కావాలంటే బీటెక్ చదవాలి. కానీ, ఇంజినీరింగ్ ప్లస్ మెడికల్ కోర్సుల మేళవింపుతో సరికొత్త నాలుగేండ్ల బీఎస్ డిగ్రీ కోర్సును ఐఐటీ మద్రాస్ నిర్వహిస్తున్నది. బీఎస్ మెడికల్ సైన్సెస్ అండ్ ఇంజినీరింగ్ పేరుతో నిర్వహిస్తున్న ఈ కోర్సులో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ కామకోటి తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేస్తే సగం డాక్టర్ అయిపోయినట్టేనని ఆయన వెల్లడించారు. వైద్య రంగంలో రోబోలు, ఇతర సాంకేతిక వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తాము ఈ కోర్సుకు రూపకల్పన చేశామని, ఇప్పటివరకు 26 వేల మంది ఈ కోర్సులో చేరారని వివరించారు. 15 ఏండ్లలో మన దేశం నుంచి ఒక నోబెల్ గ్రహీతను తయారుచేయడమే లక్ష్యంగా ఈ కోర్సును అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. ఐఐటీహెచ్‌లో నిర్వహిస్తున్న 'ఇన్వెంటివ్-2024' కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన ఆయన ప్రత్యేకంగా 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..



ప్రొఫెసర్ కామకోటి

ఇంటర్ డిసిప్లినరీ కోర్సులు

'ఏ కోర్సుల్లో చేరితే ఏం ప్రయోజనాలుంటాయో తెలియకుండానే చాలా మంది కోర్సుల్లో అడ్మిషన్లు పొందుతున్నారు. తీరా చేరాక వాటితో ప్రయోజనముండదని గ్రహించి బాధపడుతున్నారు. ఇలాంటి వారి కోసం ఐఐటీ మద్రాస్‌లో ఇంటర్ డిసిప్లినరీ కోర్సులను ప్రవేశపెట్టాం. డాటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఐదో సెమిస్టర్ తర్వాత విద్యార్థులు ఈ కోర్సులు తీసుకోవచ్చు' అని ప్రొఫెసర్ కామకోటి తెలిపారు.

100 స్టార్టప్స్‌కు పేటెంట్లు

'ఐఐటీ మద్రాస్‌లో అంత్రప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహిస్తున్నాం. ప్రత్యేకంగా సెంటర్ ఫర్ ఇన్నోవేషన్‌ను ఏర్పాటు చేశాం. విద్యార్థులు ఐడియాతో వస్తే స్టార్టప్‌లుగా ఎదిగేందుకు కావాల్సిన మార్గదర్శనాన్ని ఈ సెంటర్ అందిస్తుంది. స్టార్టప్‌ల కంపెనీలకు పేటెంట్స్ చాలా ముఖ్యం. రోజుకు ఒక పేటెంట్ లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 366 పేటెంట్స్‌కు దరఖాస్తు చేశాం. ఇప్పటికే 100 పేటెంట్స్ జారీ అయ్యాయి. ఈ 100 స్టార్టప్స్ అంత్రప్రెన్యూర్స్‌గా ఎదిగేందుకు సిద్ధంగా ఉన్నాయి.

రూరల్ ఇంటరాక్షన్ సెంటర్లు

గ్రామీణ విద్యార్థుల అండగా ఉండేందుకు సామాజిక బాధ్యతగా గ్రామాల్లో రూరల్ ఇంటరాక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులకు ఆన్‌లైన్ ట్యూషన్లు చెప్పడం వీటి ముఖ్య ఉద్దేశం. ఇప్పటివరకు 210 కేంద్రాలను తమిళనాడులో 100, యూపీలో 100, శ్రీలంకలో 10 చొప్పున ఏర్పాటుచేశాం. రాబోయే రోజుల్లో కర్ణాటక, ఏపీ, తెలంగాణలోనూ ఏర్పాటు చేస్తాం. ఈ సెంటర్లల్లో టీవీ, కెమెరా, ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నాం. మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో సాయంత్రం 6 నుంచి 8 మధ్యలో వలంటీర్లు, పూర్వ విద్యార్థులు, ఫ్యాకల్టీ ఆన్‌లైన్ ద్వారా హాజరై విద్యార్థుల సందేహాలు తీరుస్తారు. ఉన్నత విద్యలో అవకాశాలను వారికి వివరిస్తారు. ఓవర్సీస్ క్యాంపస్‌ల ఏర్పాటులో భాగంగా టాంజానియాలో ఐఐటీ మద్రాస్ క్యాంపస్ ఏర్పాటు చేశాం. చాలా దేశాలు వీటిని ఏర్పాటు చేయాలని కోరుతున్నాయి' అని కామకోటి పేర్కొన్నారు.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో

తెలంగాణ ఉపాధ్యాయుడి ప్రతిభ



ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో అభినందన పత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయుడు రాజశేఖర్‌రావు

పెద్దకొత్తపల్లి, జనవరి 20 : కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో తెలంగాణకు చెందిన ఉపాధ్యాయుడు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి అక్కడ జరిగిన సాహితీ సమ్మేళనంలో మొదటి స్థానంలో నిలిచారు. హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌లో విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 20 వరకు ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ వైజ్ఞానిక సైన్స్ లిటరేచర్ ఫెస్టివల్ నిర్వహించారు. 'నవ భారత కల్పనల్లో సైన్స్, టెక్నాలజీ పాత్ర' అనే అంశంపై దేశవ్యాప్తంగా పద్య పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించగా నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం వెన్నచర్ల జెడ్పీహెచ్ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రాజశేఖర్‌రావు ప్రతిభ చాటారు. దేశవ్యాప్తంగా 180 మందిని ఈ పోటీలకు ఎంపిక చేయగా తెలంగాణ నుంచి రాజశేఖర్‌రావు మాత్రమే ఎంపికయ్యారు. అక్కడ జరిగిన తుది సమ్మేళనంలో దేశవ్యాప్తంగా తొలిస్థానంలో నిలిచారు. ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ ఎడిషన్‌లో కూడా ఆ పద్యాన్ని ప్రచురించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రావుకు జాతీయ బాల భవన్ ప్రతినిధి మధు పంత్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ డైరెక్టర్ అరవింద్ రణడే అభినందన పత్రాన్ని అందజేశారు.

వనపర్తి కలెక్టరేట్‌లో భూసేకరణ ఫైళ్లు మాయం

వనపర్తి, జనవరి 20 : వనపర్తి కలెక్టరేట్‌లో భూసేకరణ ఫైళ్లు మాయమైనట్టు శుక్రవారం వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆరుగురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై అనుమానం ఉన్నదని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తిరుపతి రావు ఫిర్యాదు చేశారని ఎస్సై నాగన్న తెలిపారు.

ఎంజీకేఎల్ఐ పనులకు రూ.38 కోట్లు

- పూర్తిస్థాయిలో సాగునీరు ఇచ్చేందుకు చర్యలు
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



నాగర్‌కర్నూల్, జనవరి 20: ఎంజీకేఎల్ఐ పనులు చేపట్టేందుకు రూ.38 కోట్ల నిధులను సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి విడుదలకు కృషి చేస్తానని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కలెక్టర్ ఉదయ్‌కుమార్‌తో కలిసి మంత్రి సందర్శించారు. కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఐడీవోసీలో ఆయా ప్రభుత్వ శాఖల పనితీరు, సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఆ తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యా, వైద్యంతోపాటు ఇరిగేషన్, పరిశ్రమలు, ఉపాధి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ఎంజీకేఎల్ కింద పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వడానికి మరో రూ.387 కోట్ల నిధులు అవసరమని, అందులో రూ.350 కోట్లు భూసేకరణకు చెల్లించాల్సి ఉన్నదని, ప్రస్తుతానికి రూ.38 కోట్లు విడుదల చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

నిజాం షుగర్స్ పునరుద్ధరణకు కమిటీ

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వెల్లడి

బోధన్, జనవరి 20: నిజాం షుగర్స్ పునరుద్ధరణకు అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేసిందని బోధన్ ఎమ్మెల్యే పీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలో పర్యటించిన సందర్భంగా మాట్లాడారు. రైతులు కోరుకున్నట్లయితే నిజాం షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. ఫ్యాక్టరీలను తెరిపించేందుకు అవసరమైన అధ్యయనం కోసం ప్రభుత్వం వేసిన కమిటీలో తనతోపాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మరికొంతమంది ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు.

విద్యా - ఉద్యోగ సమాచారం

• 24 నుంచి సమగ్రశిక్ష ప్రాజెక్ట్ నిధులపై సోషల్ ఆడిట్

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అమలు తీరుతెన్నులపై సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారు. ఈ నెల 24 నుంచి సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) సంస్థ ద్వారా ఈ ఆడిట్ ప్రారంభంకానున్నది. రాష్ట్రంలోని 660 బడుల్లో తనిఖీలు నిర్వహిస్తారు. జిల్లాకు 20 చొప్పున పాఠశాల విద్యాశాఖ ఆయా బడులను ఎంపిక చేసింది. వీటిల్లో ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు స్కూళ్లతోపాటు, కేజీబీవీలు, యూఆర్ఎస్, మాడల్ స్కూళ్లు ఉన్నాయి.

• రేపు రాష్ట్రంలో ప్రభుత్వ హామీల కమిటీ పర్యటన

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ హామీల కమిటీ (రాజ్యసభ) సోమవారం రాష్ట్రంలో పర్యటించనున్నది. ఈ కమిటీ అధ్యయనానికి తెలంగాణ సహ చండీగఢ్‌లను ఎంచుకొన్నది. చండీగఢ్ నుంచి ఈ కమిటీ 22న హైదరాబాద్‌కు రానున్నది. రాష్ట్రంలోని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సాంకేతిక విద్యాశాఖ, ఇతర అధికారులతో భేటీ కానున్నది. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ), ఇతర అంశాలపై అధ్యయనం చేయనున్నది. రాష్ట్రంలో ఎన్ఈపీని పూర్తిగా అమలు చేయడం లేదు. యూనివర్సిటీలు దాదాపుగా ఎన్ఈపీ బాటలోనే పయనిస్తున్నాయి. ముఖ్యంగా అకడమిక్ క్రెడిట్ బ్యాంక్, మల్టీపుల్ ఎంట్రీ ఎగ్జిట్, క్రెడిట్ విధానం (సీబీసీఎస్) అమలుచేస్తున్నారు. ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటులో ముందంజలో ఉన్నాయి. ఆయా అంశాలనే ఈ కమిటీ ముందుచే అవకాశాలున్నట్టు అధికారులు తెలిపారు.

• గ్రూప్స్ ఫౌండేషన్ కోర్సులపై ఉచిత శిక్షణ

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): గ్రూప్ 1,2,3,4 ఫౌండేషన్ కోర్సుల ఉచిత శిక్షణకు ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ డీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందుకు అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలు మించొద్దని, డిగ్రీ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని వెల్లడించారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, ఫిబ్రవరి 1 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. వివరాలకు 040 24071178, 27077929 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

• గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో ఐదోతరగతి ప్రవేశాల దరఖాస్తు గడువును ఈ నెల 23 వరకు పొడిగించినట్టు గురుకులాల కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. 2023-24విద్యాసంవత్సరంలో నాల్గోతరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులు అని స్పష్టంచేశారు. ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి, మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 1800 425 45678 టోల్‌ఫ్రీ నంబర్ లేదా www.tgcet.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

• మధ్యాహ్న భోజన స్కీం నిధుల విడుదల

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం పెండింగ్ బిల్లులను దశల వారీగా విడుదల చేస్తున్నది. తాజాగా శనివారం 1 - 8 తరగతుల్లోని విద్యార్థుల బిల్లుల చెల్లింపునకు రూ.70 కోట్ల నిధులను రిలీజ్ చేసింది. ఈ వారంలోనే మొదటి విడతగా 9, 10 తరగతుల్లోని విద్యార్థుల బిల్లులు రూ.27 కోట్లు వచ్చిన విషయం తెలిసిందే. మరో రూ.9 కోట్లు త్వరలోనే విడుదల చేయనున్నట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

• నేడే సీటెట్

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) రాత పరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా130కి పైగా పట్టణాల్లో పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు రెండో పేపర్ నిర్వహిస్తారు. అభ్యర్థులు ముందుగానే హాజరుకావాలని సీబీఎస్ఈ వర్గాలు సూచించాయి.

• ఎస్ఎస్ఏ ఉద్యోగుల ధర్నా

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని, టీఏ, డీఏ ఇవ్వడం లేదని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఉద్యోగులు శనివారం ధర్నా నిర్వహించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని అపార్డ్‌లో జరుగుతున్న అన్యువల్ వర్క్‌ప్లాన్ అండ్ బడ్జెట్ ఓరియెంటేషన్‌కు హాజరైన ఉద్యోగులంతా ఈ ధర్నాలో పాల్గొన్నారు. సెక్టోరల్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్స్, టెక్నికల్ పర్సన్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జేడీలు వెంకటనర్సమ్మ, రాజీవ్, ప్లానింగ్ కోఆర్డినేటర్ సంపత్‌రావులకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఉద్యోగులు శ్రీధర్‌రెడ్డి, సైదిరెడ్డి, సంపత్, ప్రకాశ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.